సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 13 । ఆగస్టు । 2023



కలియుగ దైవానికి ప్రత్యేక పూజలు
గోవిందగిరి వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 8లో



క్షేత్రస్థాయిలో పరిశీలించండి
బీఎల్వోలు ప్రతీఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలన తరువాత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జేసీ శివ శ్రీనివాస్ ఆదేశించారు. 8లో



దాడులు అమానుషం 8లో
మణిపూర్‌లో ఆదివాసీ గిరిజనులపై దాడులు అమానుషమని పలువురు పేర్కొన్నారు. అరకులోయలో శాంతి ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేటి వైఎస్సార్‌సీపీ సమావేశం రద్దు

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరగాల్సిన పార్టీ పాడేరు నియోజకవర్గ సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేశామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల స్థానిక ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవులు నేతలు, పార్టీ శ్రేణులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆమె కోరారు. సమావేశం మళ్లీ ఎప్పుడు జరిగేది తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

చంద్రలేఖకు అభినందన



చంద్రలేఖను అభినందిస్తున్న ఎంఈవో బాలరాజు, హెచ్‌వో రమాదేవి తదితరులు

ఎటపాక: ఐరాస సదస్సుకు రాష్ట్రం నుంచి ఎంపికైన మోతుకూరి చంద్రలేఖకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.పేద కుటుంబంలో పుట్టి కస్తూర్బా బాలికల విద్యాలయంలో చదువుతూ రాష్ట్రంలో ఎటపాకకు గుర్తింపు తెచ్చిన ఆమెను శనివారం ఎంఈవో నీలి బాలరాజు, కేజీబీవీ హెచ్‌వో రమాదేవి అభినందించారు. ఐరాస సదస్సుకు వెళ్లేందుకు అవకాశం రావడం ఎంతో గర్వకారణమని వారు పేర్కొన్నారు. సదస్సులో ప్రతిభ కనబరిచి మంచి గుర్తింపు పొందాలని వారు ఆకాంక్షించారు.

వర్షంతో ఊరట



రాజవొమ్మంగిలోని పొలాల్లో చేరిన నీరు

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగి పరిసరాల్లో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దాదాపు ఎనిమిది రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతాంగం ఊరట నిచ్చింది. మరో రెండు మూడు వర్షాలు కురిస్తే ఖరీఫ్ సీజన్ నుంచి గట్టెక్క వచ్చని రైతులు తెలిపారు. దాదాపు ఐదు రోజులుగా మండలంలో వేసవిని తలపించేలా భానుడు ప్రతాపం చూపడంతో వేసవి తాపానికి గురైన ప్రజలకు ప్రస్తుతం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది.

చాపరాయికి వీకెండ్ తాకిడి



చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులు

డుంబ్రిగుడ: వీకెండ్ కావడంతో ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి మైదాన ప్రాంతం నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో సందడి నెలకొంది. స్థానిక కళాకారుల థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుటుంబ సమేతంగా తరలివచ్చిన పర్యాటకులు స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. విక్రయాలతో చిరు వ్యాపారులకు మంచి ఆదాయం లభించింది.

కుక్కల దాడి.. చిన్నారులకు తీవ్ర గాయాలు

మారేడుమిల్లి : కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. మండలంలోని చావడికోట పంచాయతీ పరిధిలోని పెరకవలస గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారులు కదల భాను ప్రకాష్ రెడ్డి, పల్లాల శశికిరణ్ రెడ్డి శనివారం ఇంటి వద్ద ఆడుకుంటున్నారు. అదే సమయంలో వారిపై దాడి చేయంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని బోదులూరు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడ నుంచి రంపచోడవరం తరలించారు.

ఏవోబీలో టెన్షన్ టెన్షన్

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో మావోయిస్టుల కదలికలు పెరిగాయన్న సమాచారం మేరకు ఇరు రాష్ట్రాల బలగాలు జల్లెడ పడుతున్నాయి. గ్రామాల్లో సైతం తనిఖీలు ముమ్మరం చేశాయి. కొంతకాలంగా ఈ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించని బలగాలు ఇప్పుడు భారీగా మోహరించడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సరిహద్దు గ్రామాల గిరిజనులు భయాందోళన చెందుతున్నారు.



ఏవోబీ సరిహద్దు గ్రామాల్లో మోహరించిన పోలీసు బలగాలు

- మావోయిస్టుల కదలికల సమాచారంతో అప్రమత్తం
- జల్లెడ పడుతున్న ఇరు రాష్ట్రాల పోలీసు బలగాలు
- భయం గుప్పెట్లో సరిహద్దు గ్రామాలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు రెండు రోజులుగా కూంబింగ్ ముమ్మరం చేశాయి. ఒడిశాకు అనుకొని ఉన్న సరిహద్దు గ్రామాల్లో మావోయిస్టుల కదలికలు పెరిగాయన్న సమాచారం మేరకు ఇరు రాష్ట్రాల పోలీసు బలగాలు అప్రమత్తమయ్యాయి. మండల కేంద్రాల్లో సైతం తనిఖీలు ముమ్మరం చేశాయి.

భారీగా మోహరింపు

ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని రంగబయలు, బుంగాపుట్టు, కుమడ, భూసిపుట్టు, జామిగూడ, ఇంజిరి పంచాయతీల్లోని ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో భారీగా గ్రేహౌండ్, స్పెషల్ పార్టీ బలగాలు మోహరించాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన సరిహద్దు గ్రామాలైన ఆంధ్రపల్లి, పనసపుట్టు, కొజిరిగూడ, జోడం, ఆంధ్రహాల్ గ్రామాల్లో అదే రాష్ట్రానికి చెందిన ఎస్‌వోజీ పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఎప్పుడూ ఏ సంఘటన చోటు చేసుకుంటుందోనని సరిహద్దు గ్రా మాల గిరిజనులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

ముంచంగిపుట్టులో విస్తృత తనిఖీలు

ముంచంగిపుట్టు మండల కేంద్రంలో శనివారం పోలీసులు సైతం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీ బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచి పెట్టారు. ఒడిశా పోలీసులు మాచ్‌ఖండ్, పాడువా, ఒనకఢిల్లీ గ్రామాల్లో అడుగడుగునా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇరురాష్ట్రాల పోలీసులు ఏవోబీలో రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించారు.

రాత్రి వేళలో పెట్రోలింగ్

పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో రాత్రి వేళల్లో సైతం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఏవోబీలో కూంబింగ్ నిర్వహించని పోలీసులు గత రెండు రోజులుగా భారీగా పోలీసు బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తుండటంతో సరిహద్దు ప్రాంతాల్లో ఆందోళన కరమైన పరిస్థితులు నెలకొన్నాయి.

నాటు తుపాకీకి యువకుడి బలి

జిల్లాలో నాటు తుపాకీల వినియోగం మరోసారి వెలుగు చూసింది. పోలీసులు **కట్టడి చేసినా** ఏదొక చోట వీటి వినియోగం వల్ల ప్రాణాలు గాలిలో కలిసిపోతూనే **ఉన్నాయి.** వనకొత్తూరు అటవీప్రాంతంలో చోటుచేసుకున్న ఘటనలో గురి తప్పిన **నాటు తుపా**కీ తూటా యువకుడి ప్రాణాలు బలిగొంది. పోషించే దిక్కును కోల్పోవ**డంతో ఆ** కుటుంబం బోరున విలపిస్తోంది.

- గురి తప్పిన తూటా
- అడవి జంతువును వేటాడుతుండగా ప్రమాదం
- వనకొత్తూరు అటవీ ప్రాంతంలో ఘటన
- నిందితుడి అరెస్టు
- లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతదేహాన్ని ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు





బుటారి బొంజుబాబు మృతదేహం, పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ

పెదబయలు: అడవి జంతువుల వేట ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. మండలంలోని లింగేటి పంచాయతీ వనకొత్తూరు గ్రామ సమీపంలో రాసకొండమ్మ తల్లి కొండ అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం మారుమూల కిల్లంకోట పంచాయతీ కప్పాలు గ్రామానికి చెందిన బుటారి బొంజుబాబు (30), ఇదే పంచాయతీ కోడుమామిడి గ్రామానికి చెందిన ఎంగ్రపల్లి సూరిబాబు (మృతుడికి వరుసకు బావమరిది), మరికొంతమంది కలిసి అడవి జంతువుల వేటకు ఈనెల 11వ తేదీన బయలుదేరారు. వీరంతా సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని పెదబయలు మండలం లింగేటి పంచాయతీ వనకొత్తూరు గ్రామ సమీపంలోని రాసకొండమ్మ తల్లి అటవీ ప్రాంతానికి నాటు తుపాకీ, ఆయుధాలతో వచ్చారు. నాటుతుపాకీని గురిపెట్టి అడవి పందిని ఎంగ్రపల్లి సూరిబాబు కాల్చాడు. అయితే గురితప్పి తూటా బూటారి బొంజుబాబు నడుంలోంచి దూసుకెళ్లింది. కొద్దినిమిషాలకే మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని వారు రాత్రికి రాత్రే కప్పాలు గ్రామానికి తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాసరావు అదే గ్రామానికి వెళ్లి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ శివశంకర్, ఎంపీటీసీ అప్పలరాజు, వీఆర్వో లక్ష్మణరావు వార్డు సభ్యులు పరామర్శించారు.

నాటు తుపాకీ స్వాధీనం

అడవి జంతువుల వేటకు ఉపయోగించిన నాటు తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాటు తుపాకీతో కాల్చిన ఎంగ్రపల్లి సూరిబాబును అదుపులో తీసుకున్నామని సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నామని వారు వివరించారు.

పోషించే దిక్కును కోల్పోయాం

మృతుడు బూటారి బొంజుబాబు తల్లిదండ్రులు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. వీరిని బొంజుబాబు రెక్కల కష్టంతో పోషిస్తున్నాడు. ఇద్దరు తమ్ముళ్లలో బాలన్న దివ్యాంగుడు. పోషించే దిక్కు కోల్పోవడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గంటలోనే ఎకరాలో వరి నాట్లు

చకచకా పూర్తిచేస్తున్న బెంగాలీ యువకులు



అప్పలరాజుపేట ప్రాంతంలో నాట్లు వేస్తున్న బెంగాలీ యువకులు

రాజవొమ్మంగి: గంట వ్యవధిలో ఎకరా విస్తీర్ణంలో వరినాట్లు పూర్తిచేసి బెంగాలీ యువకులు ఆకట్టుకుంటున్నారు. శనివారం రాజవొమ్మంగి శివారు అప్పలరాజుపేటలో వడివడిగా వేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. స్థానికంగా ఎకరా విస్తీర్ణంలో వరినాట్లు వేయాలంటే 12 మంది మహిళా కూలీలు అవసరం . అటువంటిది గంటలోనే నాట్లు పూర్తి చేస్తుండటంతో బెంగాలీ యువకులకు డిమాండ్ పెరిగింది. శాస్త్రవేత్తలు సిఫార్సు చేసినట్టుగా వీరు నాట్లు వేస్తున్నారు. దీనివల్ల దుబ్బు ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. 12 మంది యువకులు జట్టుగా ఏర్పడ్డారు. ఎకరాకు రూ.4వేల కూలి తీసుకుంటున్నారు. ఆకు తీత దగ్గర నుంచి నాట్లు వేసేవరకు అన్ని పనులు వీరే చకచకా చేసేస్తున్నారు. ఖరీఫ్, రబీ నాట్ల సమయంలో వీరంతా నెలరోజుల పాటు స్థానికంగా ఉంటూ ఉపాధి పొందుతున్నారు. సమయం, ఖర్చు ఆదా అవుతుండటంతో రైతులు వీరితో నాట్లు వేయించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

గిరి మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

- అవసరమైన స్థాయిలో ప్రభుత్వ ప్రోత్సాహం
- సెర్ఫ్ సీఈవో ఇంతియాజ్
- వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత్ ఉదయ్ భాస్కర్



మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు, చిత్రంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తోందని సెర్ఫ్ సీఈవో ఇంతియాజ్ పేర్కొన్నారు. స్థానిక యూనియన్ బ్యాంకు ప్రాంగణంలో శనివారం వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బలోపేతానికి రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. మహిళా మార్ట్‌ను నిర్వహిస్తున్న గిరి మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కిరాణా సరుకులు, కాస్మోటిక్స్, ప్లాస్టిక్ వస్తువులు, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. మహిళా మార్ట్‌ను రంపచోడవరం మండలం పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లో ఒక్కొక్క సభ్యురాలు రూ.300 వాటాధనంగా చెల్లించారన్నారు. మండలంలో 1020 సంఘాలకు గాను 815 సంఘాలు రూ.24,45,000 వాటాధనంతో ఈ మార్ట్‌ను ప్రారంభించారన్నారు. 12మందిని బోర్డు డైరెక్టర్లను ఎన్నుకుని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.లావాదేవీలన్నీ ఆన్‌లైన్, బార్ కోడ్ స్కానింగ్ ద్వారా జరుగుతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు కోరారు. ఈ కార్యక్రమంలో పీవో సూరజ్ గనోరే, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, శ్రీనిధి ఎండీ నాంచారయ్య, సెర్ఫ్ డైరెక్టర్ మహిత,కేశవ్, పీడీ మురళీ, ఏపీడీ శ్రీనివాసరావు, డీపీఎం అపర్ణ పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎలా నిర్మిస్తారు?

- అధికారులను బెదిరించి నిర్మాణ పనులను అడ్డగించిన టీడీపీ ఎంపీటీసీ, భర్త
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే దిగజారుడు రాజకీయాలు
- ధ్వజమెత్తుతున్న దిగుడుపుట్టు గ్రామస్తులు



దిగుడుపుట్టులో సెల్ టవర్ నిర్మించనున్న స్థలం

హుకుంపేట: మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణ పనులను టీడీపీ ఎంపీటీసీ కొమ్మ రమ, భర్త సింహాచలం అడ్డుకోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. తమ అనుమతి లేకుండా సెల్ టవర్ నిర్మాణం ఎలా చేపడతారని వారు పనులను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు సెల్ టవర్ నిర్మాణంపై గ్రామస్తులు తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు పనులు మొదలు పెడితే ఎంపీటీసీ, భర్త సింహాచలం అధికారులను బెదిరించి నిర్మాణ పనులను అడ్డుకున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంతోపాటు పరిసర ప్రాంతాలకు సమాచార వ్యవస్థ అందుబాటులోకి వస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. గ్రామంలో సెల్ సిగ్నల్ సమస్య ఉన్నప్పటికీ గతంలో ఏ నాయకుడు పట్టించుకోలేదని, జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే టీడీపీ నేతలు ఓర్వలేక దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వారు ధ్వజమెత్తుతున్నారు. ఈ పద్ధతి సరైనది కాదని సెల్ టవర్ నిర్మాణం అడ్డుకుంటే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ గడ్డంగి సూరిబాబు, పార్టీ నేత పాంగి అనిల్ హెచ్చరించారు.

కేజీహెచ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున శనివారం పరిశీలించారు. కేజీహెచ్‌లో అత్యవసర చికిత్స విభాగంలో ఆధునికీకరణ పనులు, క్లినికల్ ల్యాబ్, ప్రధాన ద్వారం వద్ద నిర్మిస్తున్న ఆర్చ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగం విస్తరణ పనులను రూ.30 లక్షలతో చేపడుతున్నట్టు తెలిపారు. అదే విధంగా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా అత్యవసర క్లినికల్ ల్యాబ్ రూ.15 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు, డీఈ మన్మథరావు, ఏడీ శ్రీనివాస కుమార్‌పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో పరిశీలించండి

- ఓటర్ల జాబితా సవరణపై జేసీ శివ శ్రీనివాస్ ఆదేశం

గూడెంకొత్తవీధి: బీఎల్వోలు ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలన తరువాత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితాలోనే పేరు పరిశీలన అనంతరం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కుటుంబంలో ఎక్కువ మంది ఓటర్లు ఉంటే వారికి ఒకే ఇంటి నెంబర్ వేయాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, మృతులు డూప్లికేట్ ఓటర్ల వివరాలను పూర్తి పరిశీలన తరువాత అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇంటింటా పర్యటిస్తే వివరాలు తెలుస్తాయని సూచించారు. తహశీల్దార్ ప్రసాద్, డీటీ కుమారస్వామి, సూపర్‌వైజర్లు మహదేవ్, కామేశ్వరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

కలియుగ దైవానికి ప్రత్యేక పూజలు

రంపచోడవరం: గోవిందగిరి వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు గోవిందనామాలు, సహస్ర నామాలు పారాయణం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు రాజమహేంద్రవరానికి చెందిన భక్తులు అన్నసమారాధన చేశారు. ఆలయ అధికారులు నారాయణరాజు , గిరిబాబు, రంపచోడవరం ధర్మ ప్రచార సేవా భక్త బృందం కో–ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి పర్యవేక్షించారు.

శ్రీవారి సన్నిధిలో లడ్డూల విక్రయం

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూల విక్రయాలను శనివారం ఏఈవో జగన్మోహనాచార్యులు ప్రారంభించారు. ప్రతి నెలా రెండవ శనివారం ఇక్కడ శ్రీవారి లడ్డూలను విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. లడ్డూల విక్రయ కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఇక నుంచి రూ.50, రూ.200 లడ్డూలను అందుబాటులో ఉంటాయని చెప్పారు.

గిరిజనులపై దాడులు అమానుషం

మణిపూర్ ఘటనపై నిరసన ర్యాలీ



అరకులోయలో భారీ ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

అరకులోయటౌన్: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కోరుతూ అరకులోయలో క్రిష్టియన్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజనులపై దాడులు అమానుషమని, క్రైస్తవులు, ఆదివాసీలు స్వేచ్ఛగా ఉండేలా పాలకులు చర్యలు చేపట్టాలన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పి, యధావిధిగా ప్రజల జీవనాన్ని కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ గార్డెన్ నుంచి చేపట్టిన భారీ ర్యాలీలో జై భారత్, క్రిష్టియన్ సమాజం ఐక్యత వర్ధిల్లాలి, మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి, దోషులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. వందలాది మంది క్రైస్తవులు ప్లే కార్డులు చేతబట్టి నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగ రాష్ట్ర చైర్మన్ పాచిపెంట శాంతకుమారి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సాల్మన్ ఆధ్వర్యంలో మహిళలు కళ్లకు నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన తెలిపారు. జెడ్పీటీసీ శెట్టి రోషిణి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలదేవ్, ఐక్యవేదిక ప్రతినిధులు సంజీవ్ కుమార్, బాబూరావు, ఆనందరావు, ప్రసాద్, రావుపల్లి రవి, డేవిడ్, ఎంపీటీసీ భీమరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరావు, సాంభ, సంపత్, విజయ్‌కుమార్, గురు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

‘డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం’


వెబ్‌నార్‌లో పాల్గొన్న అతిథులు

సబ్బవరం: డిజిటల్, బ్లాక్‌చెయిన్ లావాదేవీలకు సంబంధించి వినియోగదారుల్లో అవగాహన అవసరమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ డా పి.శ్రీ సుధ అన్నారు. వర్సిటీ ఆధ్వర్యంలో శనివారం డిజిటల్ యుగంలో వినియోగదారుల రక్షణ అంశంపై వెబ్‌నార్ జరిగింది. ఈ సందర్భంగా ఔరంగాబాద్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ కె.వి.ఎస్ శర్మ మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి సహాయపడే యాప్‌ల గురించి వివరించారు. సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ రీసెర్చ్ ప్రకారం డిజిటల్ ప్లాట్‌ఫాంలు అన్ని స్థాయి వ్యక్తులను ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. యాప్‌ల ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరించడానికి ఓ వేదిక ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌ఎల్‌యూ రాంచీ ఉపకులపతి అశోక్ ఆర్. పాటిల్ మాట్లాడుతూ ఈ–కామర్స్ సంబంధించి వినియోగదారులకు కోసం 2019లో ఓ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో జరిమానా విధించవచ్చన్నారు. వినియోగదారుల నిపుణుడు సురేష్ మిశ్రా మాట్లాడుతూ ఈ–కామర్స్ ప్లాట్‌ఫాంల ద్వారా వినియోగదారుల డేటా దుర్వినియోగం అవుతోందన్నారు. సైబర్ లా నిపుణుడు ప్రశాంత్ మాలి వినియోగదారుల రక్షణ చట్టం అమలులో ఉన్న లోటుపాట్లపై మాట్లాడారు. ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, పి.వి.వి.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు


దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన గంజాయి, కారుతో ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి: కారులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన ఐదుగురు యువకులను దేవరాపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నెలతూరు గ్రామానికి చెందిన వడ్డెల వాసు, వడ్డెల అనిల్, వడ్డెల పెదబాబు, రావూరి పవన్‌తోపాటు బాలుడు(17) కారులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మన్యానికి వెళ్లారు. అక్కడ ఆరు కేజీల గంజాయి కొనుగోలు చేసి పినకోట, దేవరాపల్లి మీదుగా ప్రకాశం జిల్లాకు పయనమయ్యారు. ఈ క్రమంలో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో గంజాయి తరలిస్తున్న ఐదుగురు యువకులు పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకొని కారును తనిఖీ చేయగా ఆరు కేజీల గంజాయి లభ్యమైంది. కారును, గంజాయిని, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను చోడవరం కోర్టులో హాజరు పరిచామని ఎస్‌ఐ తెలిపారు. బాలుడ్ని జువైనల్ కోర్టుకు తరలించామన్నారు.

విద్యుదాఘాతానికి గురై కూలీ మృతి


రాముునాయుడు మృతదేహం

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన ఏడువాక బంగారునాయుడు(46) విద్యుదా ఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ బి. శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. బంగారునాయుడు కూలీ పని చేసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో కళ్లు తిరిగి పడిపోయాడు. ఆ సమయంలో అనుకోకుండా పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన స్తంభానికి చేయి తాకడంతో షాక్‌కు గురయ్యాడు. అది చూసిన స్థానికులు అతడిని చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవపరిచారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నా రు. మృతుడు చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో సీజనల్ ఉద్యోగి. అతని కుమారుడు షణ్ముఖసాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

వలిసెల సాగుకు ప్రోత్సాహం


మహిళ రైతుకు వలిసెల విత్తనాలు అందజేస్తున్న ప్రొఫెసర్ మంజుశ్రీ, తదితరులు

అరకులోయటౌన్: మన్యంలోని వలిసెలు సాగు చేసే గిరి రైతులను సంపూర్ణంగా ప్రోత్సహిస్తామని గీతం యూనివర్శిటీ సీనియర్ ప్రొఫెసర్ మంజుశ్రీ అన్నారు. మండలంలోని చినలబుడు పంచాయతీ హట్టగుడ గ్రామంలో ఉచిత వలిసెల విత్తనాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో వలిసెల సాగు అంతరించిపోతుందని, దానికి గుర్తించి కేంద్ర ప్రభుత్వ డిపార్టుమెంట్ సైన్సు, టెక్నాలజీ విభాగం ఆర్థిక సహాయంతో వలిసెల సాగుకు ప్రొత్సహించాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన 500 గిరిజన రైతు కుటుంబాలకు వలిసెల సాగు, దానికి అనుగుణంగా తేనే టీగల పెంపకానికి ప్రోత్సహిస్తామన్నారు. అలాగే హట్టగుడ, యండపల్లి వలసలో వలిసెలు నూనె, తేనె ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న మూడేళ్ల వరకు అందుకు అవసరమైన విత్తనాలు, శిక్షణ, యంత్ర పరికరాలను అందిస్తామన్నారు. భవిష్యత్‌లో గిరిజన కుటుంబాలు వలిసెలు, తేనేతో ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వలిసెల సాగుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సందీప్ రైతులకు వివరించారు. అనంతరం గిరిజన రైతులకు ఉచితంగా మేలైన వలిసెల విత్తనాలను అందజేశారు. గీతం ప్రొఫెసర్ ఇమంది శరత్‌బాబు, డీఎస్‌టీ ప్రాజెక్టు ప్రతినిధులు కిరణ్, శ్రీనివాస్, నాగరాజు, నాగేశ్వరరావు, నాగేంద్ర, చినలబుడు సర్పంచ్ ఉపేంద్ర, గిరిరైతులు పాల్గొన్నారు.

బైకు, కారు ఢీకొని ఇద్దరికి గాయాలు


సంఘటన స్థలంలో దెబ్బతిన్న కారు, బైకు

మారేడుమిల్లి : మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రామచంద్రపురానికి చెందిన లోకేష్, దిలీప్ అనే ఇద్దరు యువకులు బైకుపై మారేడుమిల్లికి విహారయాత్రకు వస్తుండగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారుతో సున్నంపాడు గ్రామం దాటిన తరువాత ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరికీ కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో రంపచోడవరం తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యసేవల కోసం కాకినాడ తరలించారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన యువకుడు వీరవెంకట వరప్రసాద్

హుకుంపేట : తల్లి మందలించిందని మనస్తాపానికి గురై యువకుడు ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాలివి. పాడేరు మండలం వనుగుపల్లి గ్రామంలో కోడ కనకలమ్మకు వివాహం జరిగింది. కుమారుడు పుట్టిన కొన్ని రోజులకు భర్త మోహన్‌రావు మృతి చెందడంతో కనకలమ్మ తన కుమారుడు వరప్రసాద్‌తో హుకుంపేట మండలం శోభకోట పంచాయితీ సుంద్రుపుట్టు గ్రామంలో జీవన్‌రాజు వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. వరప్రసాద్ మోదపుట్టు పాఠశాలలో 6వ తరగతి వరకు చదివి మధ్యలో మానేసాడు. పాఠశాలకు వెళ్లకుండా ఇంటివద్ద ఉండడంతో తల్లి కనకలమ్మ చదువుకోకుండా పొలం పనులకు కానీ, పశువుల కాయడానికి కానీ వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటావని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వరప్రసాద్ ఇంటిలో దూలానికి ఉరివేసుకుని మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు కొన్ని రోజులు వనుగుపల్లిలో కొన్ని రోజులు సుంద్రుపుట్టులో గడిపేవాడని, సుంద్రుపుట్టు వచ్చి వారం రోజులు అవుతుందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.